# హామీలను తప్పకుండా నెరవేరుస్తాం

**పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కులకచర్ల, డిసెంబర్ 30 : ప్రజలకు సంక్షేమ ఫథకాలు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో సర్పంచ్ శిరీషాలక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రజా పాలనలో దరఖాస్తుల సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గ్రామాల్లో దరఖాస్తుల సేకరణ కార్యక్రమంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కులకచర్ల మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఎంపీటీసీ జ్యోతీశ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవరెడ్డి, అంజిలయ్యగౌడ్, పెంటమీది వెంకటయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోండి

**కలెక్టర్ నారాయణరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, డిసెంబర్ 30 : ప్రజా పాలన కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని వార్డు నెంబర్ 7 గుడుపల్లిలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల కోసం జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హుల నుంచి గ్రామ సభల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు నింపరాని వారి కోసం గ్రామసభల వద్ద హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ మంజులా రమేశ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**జడ్పీ డిప్యూటీ సీఈవో సుభాషిణి**

**ప్రజాపాలనలో దరఖాస్తుల వెల్లువ**



ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

వికారాబాద్, డిసెంబర్ 30 : పథకాల అమలు కోసం దరఖాస్తుల స్వీకరణలో భాగంగా ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జడ్పీ డిప్యూటీ సీఈవో సుభాషిణి తెలిపారు. శనివారం వికారాబాద్ మండల పరిధిలోని గొట్టిముక్కల, పీలారం, పులుసుమామిడి, పీరంపల్లి గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించారు. గొట్టిముక్కల, పీలారం గ్రామాల్లో జరుగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, సర్పంచ్ వెంకటేశం, ఎంపీవో నాగరాజు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

**కొడంగల్** : మండలంలోని పెద్దనందిగామ, చిన్ననందిగా, హస్నాబాద్, ఆలేడు గ్రామాలతో పాటు మున్సిపల్ పరిధిలోని కొండారెడ్డిపల్లి, గుండ్లకుంట గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగింది. అర్జిదారులు 6 గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తులను అధికారులకు అందజేశారు. మున్సిపల్ పరిధిలో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డితో పాటు సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి పాల్గొని దరఖాస్తులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అదనపు పీడీ కీవెన్‌నిల్, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమేశ్ సర్పంచ్‌లు శారదమ్మ, సావిత్రమ్మ, ఫకీరప్ప, విజయమ్మ పాల్గొన్నారు.

**పెద్దేముల్‌లో...**

పెద్దేముల్ : మండల పరిధిలోని గిర్మాపూర్, జయరాంతండా(ఐ), రుక్మాపూర్, రేగొండి, హన్మాపూర్ గ్రామాల్లో ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ లలితకుమారి, జడ్పీటీసీ ధారాసింగ్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్వో కె.కిషన్, ఎంపీడీవో లక్ష్మప్ప, సర్పంచ్ శివలీల, హైదర్, సొసైటీ డైరెక్టర్ నారాయణరెడ్డి, శోభమ్మ, ఆర్ఐ రాజురెడ్డి, ఎంపీవో రమేశ్‌కుమార్, సూపర్‌వైజర్ రాణి, ఏఈ సందీప్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, మల్లేశం, ఏఎన్‌ఎం స్వప్న, టీఏ విజయ్‌కుమార్, మల్లేశం, ఐకేపీ సీసీ అనంతయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట: మదన్‌పల్లిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

**దోమ మండలంలో..**

దోమ : మండల పరిదిలోని పాలేపల్లి, దిర్సంపల్లి, దిర్సంపల్లి తండా, బొంపల్లి, పద్దతండా, చిన్నతండా గ్రామాల్లో ప్రజా పాలన సదస్సుల్లో భాగంగా ప్రభుత్వం తీసుకువచ్చిన అభయ హస్తం ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను గ్రామాల్లోని అర్హులైన లబ్ధిదారుల నుంచి అధికారులు స్వీకరిస్తున్నారు. శనివారం మండల పరిధిలోని పాలేపల్లి గ్రామంలో సర్పంచ్ యశోదతిరుపతయ్య ఆధ్వర్యంలో ఎంపీడీవో జయరాం ప్రజాపాలన సదస్సులో ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**నవాబుపేట** : ప్రభుత్వం ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నదని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జయరాం అన్నారు. మూడోరోజు కూడా మండలంలోని గ్రామాల నుంచి దరఖాస్తులను అధికారులు తీసుకున్నట్లు తెలిపారు. శనివారం కడ్చర్ల, కేశవపల్లి, లింగంపల్లి, గుబ్బడీఫతేపూర్ గ్రామాల్లో మండలాధికారులు రేషన్‌కార్డుల కోసం ప్రభుత్వం సూచించిన విషయాలను తహసీల్దార్ జయరాం గుర్తుజేశారు. కార్యక్రమాల్లో సెక్రటరీలు, మండల రెవెన్యూ అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

**అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి**

పరిగి : అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని పరిగి ఎంపీపీ కరణం అరవిందరావు, పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ పేర్కొన్నారు. శనివారం పరిగి మండలం బసిరెడ్డిపల్లిలో జరిగిన ప్రజాపాలనలో ఎంపీపీ అరవిందరావు, పరిగి మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో జరిగిన ప్రజాపాలనలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అశోక్ మాట్లాడుతూ అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిశర్మ, ఎంపీవో దయానంద్, సర్పంచ్ సూరప్ప, అధికారులు పాల్గొన్నారు.

**బొంరాస్‌పేటలో..**

బొంరాస్‌పేట : బొంరాస్‌పేట, దుద్యాలల్లో శనివారం మూడవ రోజు కూడా ప్రజాపాలన కార్యక్రమం కొనసాగింది. బొంరాస్‌పేట మండలంలోని నాగిరెడ్డిపల్లి, మదన్‌పల్లి, మదన్‌పల్లి తండా, బాపన్‌చెరువుతండా, మూడుమామిళ్లండా, దుద్యాల మండలంలోని చెట్టుపల్లితండా, సంత్రకుంటతండాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ప్రజలు సంక్షేమ పథకాల కోసం అధికారులకు దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి, తహసీల్దార్లు వెంకటేశ్, దానయ్య, ఎంపీడీవో వెంకన్‌గౌడ్, డీటీ రవి, ఆర్ఐ రవిచారి, అధికారులు పాల్గొన్నారు.



కులకచర్ల మండలం బండవెల్కిచర్లలో దరఖాస్తుల సేకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న డీపీవో తరుణ్‌కుమార్

## దరఖాస్తుల సేకరణ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలి

కులకచర్ల, డిసెంబర్ 30 : దరఖాస్తుల సేకరణ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని వికారాబాద్ డీపీవో తరుణ్‌కుమార్ అన్నారు. శనివారం కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల, బొంరెడ్డిపల్లి గ్రామాల్లో దరఖాస్తుల సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన వారు దరఖాస్తులు చేసుకునేందుకు అభయహస్తం ఫారాలను అందజేయాలని సూచించారు. ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఈ సందర్భంగా సిబ్బందితో తెలిపారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీడీ, మండల ప్రత్యేక అధికారి సరళాదేవి, ఎంపీడీవో నాగవేణి, ఎంపీవో కరీం, అధికారులు పాల్గొన్నారు.

**వివిధ గ్రామాల్లో..**

మండల పరిధిలోని కుస్మసముద్రం చెరువుముందలి తండాలో నిర్వహించిన కార్యక్రమాన్ని తహసీల్దార్ మురళీధర్ పరిశీలించారు. చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ గ్రామంలో గ్రామ సర్పంచ్ మఠం ప్రమీల ఆధ్వర్యంలో దరఖాస్తుల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ రాందాస్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు మఠం రాజశేఖర్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కులకచర్ల మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, అధికారులు, పార్టీల నాయకుల ఆధ్వర్యంలో దరఖాస్తుల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి దరఖాస్తు ఫారాలు అందజేశారు.

## 'సమస్యలు పరిష్కరించండి'

వికారాబాద్, డిసెంబర్ 30 : ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు హారతి ద్వారకానాథ్ అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని సత్యసాయి జ్ఞాన కేంద్రం గంగవరంలో జిల్లా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో విశ్రాంత ఉద్యోగులకు సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు బస్వరాజు, సంఘం మండల అధ్యక్షుడు మాణిక్‌ప్రభు, భక్తవత్సలం, న్యాయవాది గోపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి, మండల ఉపాధ్యక్షులు బందప్పగౌడ్, విటోబా, ఆయా మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

## భర్తపై ఫిర్యాదు

పరిగి టౌన్, డిసెంబర్ 30 : యువతితో తన భర్త వివాహేతర సంబంధం పెట్టుకొని తనను పట్టించుకోవడం లేదని భార్య రజిత తన అన్నదమ్ములతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన శనివారం పరిగిలో చోటుచేసుకుంది. పరిగి మండల పరిధిలోని రాపోల్ గ్రామానికి చెందిన రాంకుమార్‌కు కొందుర్గు మండల పరిధిలోని చెర్కుపల్లి గ్రామానికి చెందిన రజితతో ఐదేండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక బాబు ఉన్నాడు. గత కొన్ని నెలల నుంచి భార్య రజితను పట్టించుకోకుండా ఓ యువతితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని, దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయింది. తాను లేని సమయంలో యువతితో కలిసి ఉండగా తన సోదరులతో కలిసి శనివారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు భార్యాభర్తలిద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్లు తెలిసింది.

## ఘనంగా గణిత దినోత్సవం

యాలాల, డిసెంబర్ 30 : శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణితంలో విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించినట్లు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఉప్పరి వెంకటయ్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని అగ్గనూరు జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణిత దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గణితంలో విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థికి తన వంతుగా రూ.5000 బహుమతిగా అందించనున్నట్లు తెలిపారు. అనంతరం గణిత ఉపాధ్యాయుడిని సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**లోక్‌అదాలత్‌లో**

## 4215 కేసులు పరిష్కారం

తాండూర్, డిసెంబర్ 30 : తాండూరు కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో భారీగా కేసులు పరిష్కారం అయ్యాయని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివలీల, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నామాల అశోక్ తెలిపారు. మొత్తం 4215 కేసులు పరిష్కారం కాగా, జరిమానాల ద్వారా ప్రభుత్వానికి రూ.3,54,190 ఆదాయం వచ్చిందన్నారు. లోక్‌అదాలత్ విజయవంతం చేసేందుకు, కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్, ఎక్సైజ్, ఇతర శాఖల అధికారులు, కోర్టు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.